ఉన్నత విద్యాభ్యాసంతోనే ముందడుగు

సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి



విద్యార్థినికి స్కూల్‌బ్యాగు అందజేస్తున్న న్యాయమూర్తి శ్రీదేవి

కల్వకుర్తిపట్టణం, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరు అవకాశాలను సద్విని యోగం చేసుకుని ఉన్నత చదువులు చదివితే జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చని కల్వకుర్తి కోర్టు సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి అన్నారు. మంగళవారం ఇందిరానగర్ కాలనీలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొని మాట్లాడారు. చదువుకోవడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని వివిధ కారణాలతో విద్యకు దూరం కావద్దన్నారు. చదువుకోవాలనే పట్టుదల ఉంటే ఎన్ని అడ్డంకులున్నా అధిరోహించవచ్చన్నారు. చట్టాలపై అవగాహన కలిగిఉంటే హక్కులను పూర్తిస్థాయిలో ఉపయోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు విద్యావంతులు కావాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు పని చేస్తున్నందున పైచదువులపై దృష్టి సారించాలన్నారు. అనంతరం యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులను కాలనీలోని విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో సీఐ నాగార్జున, ఎస్సై మాధవరెడ్డి, యూత్ ఫర్ సేవా సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఈనాడు నాగర్‌కర్నూల్

ఇళ్లపై మృత్యుపాశాలు

11 కేవీ విద్యుత్తు లైన్లతో ముప్పు

● కోడేరు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక, అంగన్‌వాడీ కేంద్రాలపై నుంచి 11 కేవీ విద్యుత్తు లైన్ ఉంది. జెండా పండుగకు ఓ విద్యార్థి విద్యుదాఘాతానికి గురై గాయాలపాలయ్యాడు. రెండేళ్లుగా మూడు ఇళ్లపై తీగలు ఉన్నాయి. ఇంటి నిర్మాణ చేసుకునే సమయంలో ఓ వ్యక్తికి కరెంటు షాక్ కొట్టి తీవ్ర గాయాలయ్యాయి. ఇంటిపైకి వెళ్లిన మూడు శునకాలు, మేకపోతు రెండు నెలల కిందట మృత్యువాత పడ్డాయి. వర్షం వస్తే ఇంటి గోడలకు కరెంటు సరఫరా అవుతోందని బాధిత కుటుంబికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖానాపూర్‌లో ఇళ్లపై తీగలు ఉండటంతో ఆరు నెలల కిందట పశువుల పాక దగ్ధమైంది. నర్సాయిపల్లిలో విద్యుత్తు ఉప కేంద్రానికి ఉన్న లైన్ కుంటలో కిందకి ఒరిగి ఉండటంతో నీటిని తాగేందుకు వెళ్లి మూగ జీవాలు మృత్యువాత పడ్డాయి.

● పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్‌లోని ప్రభుత్వ పాఠశాల పక్కనుంచి తీగ ఏర్పాటైంది. రెండు అంతస్తుల భవనాలు నిర్మాణం చేయడంతో ప్రమాదకరంగా మారింది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై విద్యుత్తు అధికారులకు గ్రామ సభలు నిర్వహించి విన్నవించినా సమస్య తీరలేదు. ఎప్పుడు ఎలాంటి సమస్య వస్తుందోనని భయాందోళన చెందుతున్నారు.

● కొల్లాపూర్ కొత్త బస్టాండు నుంచి ప్రభుత్వాస్పత్రి వరకు ఇళ్లపై నుంచి లైన్ ఏర్పాటు ఉంది. పక్కన ఉన్న ఎల్‌టీ లైన్ల సమస్య వస్తే విద్యుత్తు సిబ్బందికే ముప్పుఉంది. నియంత్రికలకు నేరుగా ఉన్న లెవెన్ కేవీ విద్యుత్తు లైన్లను ప్రత్యేక చొరవ తీసుకొని ప్రమాదం లేకుండా ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



కోడేరు ఎస్సీ కాలనీలో ఓ ఇంటిపై 11 కేవీ విద్యుత్తు తీగలు తగిలి మృత్యువాత పడిన మేక

కోడేరు, కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాల్లోని విద్యుత్తు ఉప కేంద్రాలు ఫీడర్లకు నేరుగా నియంత్రికలకు ఏర్పాటు చేసిన 11 కేవీ విద్యుత్తు లైన్లతో ప్రమాదం పొంచి ఉంది. కొన్ని పాఠశాలలు, కొత్త కాలనీల్లోని నివాస ఇళ్లపై ఉన్న లెవెన్ కేవీ విద్యుత్తు లైన్లతో ప్రజలు విద్యుదాఘాతాల బారిన పడి ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరుగుతున్నా ముప్పు ఉందని తెలిసినా విద్యుత్తుశాఖ అధికారులు నివారించడంతో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎన్నిసార్లు విద్యుత్తు అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోడేరు, పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్, మండలాల్లో ఈ పరిస్థితి నెలకొంది.

కాలనీల విస్తరణతో..

మండల కేంద్రాల్లో కొత్త కాలనీలు పెరిగిపోతున్నాయి. ఊరి చివర ఉన్న లెవెన్ కేవీ విద్యుత్తు లైన్ల కింద కూడా ఇళ్ల నిర్మాణం పెరిగింది. విద్యుత్తు తీగలకు అయిదు అడుగుల దూరంలో కరెంటు ప్రభావం అధికం. నివాస ఇళ్లపైకి వెళ్లిన ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎక్కువగా మండల కేంద్రాల్లో ఇలాంటి పరిస్థితి నెలకొంది. వర్షాలు వచ్చాయంటే ఇంటి పైకి ఎక్కాలంటే చాలు తీగల సమస్యతో భయాందోళన చెందుతున్నారు.

సమన్వయ లోపంతో..

గ్రామాల్లో కొత్త కాలనీలు పెరిగిన వాటిని విద్యుత్తు శాఖ అధికారులు గుర్తించి లెవెన్ కేవీ విద్యుత్తు లైన్లు ఒక చోటు నుంచి మరోచోటికి మార్చేందుకు అంచనాలు వేయాలి. స్తంభాలు, సామగ్రికి ఖర్చులు చెల్లించే విధంగా గ్రామ పంచాయతీ అధికారులు తెలుపాలి. గ్రామపంచాయతీ అధికారులు డబ్బులు చెల్లికపోవడంతో విద్యుత్తు అధికారులు సమస్య ఉన్న లెవెన్ కేవీ లైన్ల తొలగింపు పట్టించుకోవడం లేదు. రెండు శాఖల అధికారుల సమన్వయం లేకపోవడంతో విద్యుత్తు సమస్య తీరడంలేదు. సమస్య ఉందని ప్రజలు కరెంటు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా డబ్బులు కట్టలేదని, సమస్య మాదికాదంటూ ఒకరిపై మరొకరు చెబుతూ దాటవేస్తున్నారు.

నిధుల సమస్యతో..: గ్రామాల్లో ప్రధాన సమస్య ఉన్న కొన్ని చోట్ల లెవెన్ కేవీ విద్యుత్తు లైన్లు గుర్తించాం. మరో చోటుకు మార్చేందుకు కొన్ని వాటికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరవగానే సమస్య పరిష్కరించే విధంగా చూస్తాం.

- చంద్రశేఖర్, ఏడీ, విద్యుత్తు శాఖ, కొల్లాపూర్

మార్కెట్ యార్డులో ఆగిన పనులు

వరద నీటితో తంటాలు



నాగర్‌కర్నూల్ మార్కెట్ యార్డులో నిలిచిన రైతు విశ్రాంతి భవనం



యార్డులో వరద నీటి ప్రవాహం..

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : నాగర్‌కర్నూల్ పట్టణానికి సమీపంలో నెల్లికొండ వద్ద ఏర్పాటు చేసిన మార్కెట్‌యార్డులో నిర్మాణం పనులు నిలిచిపోయాయి. పట్టణంలో ఉన్న మార్కెట్‌యార్డును రెండేళ్ల క్రితం కొత్త మార్కెట్‌యార్డులోకి మార్చారు. రెండేళ్లుగా అక్కడే క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. కొన్ని పనులు పూర్తి కాకపోవడంతో రైతులకు ఇబ్బందులు కలుగుతున్నాయి. యార్డులో రైతులకు క్యాంటిన్, విశ్రాంతి భవనం కోసం రూ. 70లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో ఏడాదిన్నర క్రితం పనులు మొదలు పెట్టారు. 60 శాతం పనులు పూర్తి చేశారు. 8 నెలల నుంచి పనులు ముందుకు సాగటం లేదు. బిల్లులు రాలేదని పనులను ఆపేశారు. రూ. 40లక్షలతో చేపట్టిన ముఖ ద్వారం పనులు నత్తనడకన సాగుతున్నాయి. రూ. 2 కోట్లతో చేపట్టిన కవర్‌షెడ్డు, సీసీ ప్లాట్‌ఫాం పనులు పూర్తి అయ్యాయి. చేసిన పనులకు 50 శాతం కూడా బిల్లులు రాలేదని గుత్తేదారులు వాపోతున్నారు. పెండింగ్ పనులు పూర్తి చేయలేకపోతున్నట్లు పేర్కొంటున్నారు. రైతులు విశ్రాంతి తీసుకోవడానికి వసతులు లేవు. క్యాంటిన్ సౌకర్యం లేకపోవడంతో తినటానికి రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం సమయంలో భోజనాలు చేయాలంటే హోటళ్ల కోసం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పట్టణానికి రావాల్సి వస్తోంది.

● యార్డులోకి పెద్ద మొత్తంలో నీళ్లు రావడంపై నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడామని, త్వరలోనే చర్యలు చేపడతామని మార్కెట్ కార్యదర్శి రవికుమార్ పేర్కొన్నారు.

రూ.4.5 కోట్లతో ప్రతిపాదనలు: మార్కెట్‌యార్డులో డ్రైనేజీ సౌకర్యం లేదు. పై భాగంలో ఉన్న నెల్లికొండ, కలెక్టరేట్ ప్రాంతం నుంచి వచ్చే వరద నీటితో తంటాలు పడుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎక్కడ పడితే అక్కడ నెర్రెలు వచ్చాయి. వరద నీరు అలాగే వస్తే అందులో ఉన్న కట్టడాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. యార్డు చుట్టూ కాలువ నిర్మించాల్సి ఉంది. గతేడాదిత డ్రైనేజీ కాలువ నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరయ్యాయి. అప్పట్లో టెండర్లు పూర్తి కాలేదు. ఆ తర్వాత ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ ఆగింది. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత టెండర్లు కాని పనులను రద్దు చేసింది. ఇప్పుడు మళ్లీ రూ. 4.50 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. నిధులు మంజూరైతేనే కాలువ సమస్య తీరనుంది.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి



పాఠశాల కేటాయింపు పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. పాఠశాలల కేటాయింపు పత్రాలను కలెక్టర్ ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎంపికై కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు 210 మందికి కేటాయింపుల ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేశామన్నారు. 129 మంది ఎస్జీటీ ఉపాధ్యాయులను ఖాళీగా ఉన్న ప్రాథమిక పాఠశాలలకు, 13 భాషా పండిత్ ఉపాధ్యాయులు, 66 మంది స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలలకు, ఇద్దరు వ్యాయామ ఉపాధ్యాయులను ఖాళీల వారీగా పాఠశాలలకు కేటాయించినట్లు చెప్పారు. ఉత్తర్వులు అందుకున్న వారు బుధవారం నుంచి కేటాయించిన పాఠశాలల్లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, డీఈవో గోవిందరాజులు పాల్గొన్నారు.

జూరాలకు పెరిగిన వరద

ధరూరు న్యూస్‌టుడే: జూరాల జలాశయంలోకి 60వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. దీంతో గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. జలవిద్యుదుత్పత్తి ద్వారా 38వేల క్యూసెక్కులు, మూడు గేట్లు ఎత్తి 21వేల క్యూసెక్కులు మొత్తం 59 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. కర్ణాటకలోని ఆలమట్టి జలాశయంలోకి 21వేల క్యూసెక్కుల వరద చేరుతుండగా దిగువకు 18వేల క్యూసెక్కులు వదులుతున్నారు. నారాయణ్‌పూర్ జలాశయంలోకి 48వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. దిగువకు 45వేల క్యూసెక్కులు వదులుతున్నారు.

కేఎల్ఐ డి-82 కాల్వకు ఏడోసారి గండి



యంత్రంతో గండి పూడ్చుతున్న దృశ్యం




కాల్వకు గండిపడి వృథాగా పోతున్న నీరు

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే : వెల్దండ మండల కేంద్రం సమీపంలోని కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డి-82 ప్రధాన కాల్వకు సోమవారం రాత్రి గండి పడింది. ఇటీవల కేఎల్ఐ ప్రధాన కాల్వ ద్వారా దిగువకు సాగునీటిని విడుదల చేయడంతో ఈనెల 11న వెల్దండ మండలానికి సాగునీరు చేరింది. డి-82 ప్రధాన కాల్వ 24.05 కిలో మీటరు వద్ద గండి పడటంతో కాల్వలోని నీరంతా సమీప అల్లం తోటబావి తండా సమీపంలోని కల్యాణ చెరువులోకి పోయింది. విషయం తెలుసుకున్న నీటిపారుదల శాఖ డీఈ సమ్మయ్య ఆధ్వర్యంలో మంగళవారం యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి గండికి పూడ్చివేశారు. ఈకాల్వకు కుడి, ఎడమ వైపుల ఇక్కడే ఏడోసారి గండి పడటం గమనార్హం. సెప్టెంబర్ 4న రాత్రి ఎడమ వైపు గండి పడగా ఇప్పుడు కుడి వైపు గండి పడింది. చిన్నపాటి వర్షం కురిసినా.. కాల్వలోకి నీటి వరద అధికమైనా గండి పడటం పరిపాటిగా మారింది. పనుల్లో నాణ్యతాలోపంతోనే ఎక్కడో ఒక చోట ఏటా గండ్లు పడుతున్నాయని రైతన్నలు ఆరోపిస్తున్నారు.

● కాల్వ మధ్యలో పలు చోట్ల రైతులు సొంతంగా రాళ్లు, మట్టితో తాత్కాలికంగా వేసుకున్న రహదారుల వద్ద నీరు ముందుకు వెళ్లడం లేదు. రైతులు అడ్డుకోవడంతోనే పాటు కాల్వ పనులు చివరి ఆయకట్టు వరకు పూర్తి స్థాయిలో పనులు పూర్తి కాలేదు. చెర్కూర్ పరిధిలోని పలువురు భూనిర్వాసితులు పరిహారం అందలేదని, కాల్వకు అడ్డుగా బండలు వేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

వైద్యో నారాయణ.. మీకిది తగునా..!



● ఓ జనరల్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యుల్లో సగం మందికి ప్రైవేటు ఆస్పత్రులున్నాయి. ఆ దవాఖానాల్లోనే చికిత్స పేరుతో కన్సల్టెంట్ వైద్యులుగా బోర్డులపై పేర్లు రాయించుకుని వైద్యం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రికొచ్చే పలువురు రోగులను తమ ప్రైవేటు నర్సింగ్‌హోంలకు వచ్చేలా ఒత్తిడి తీసుకొస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● ఓ జిల్లాలో సూపరింటెండెంట్ స్థాయి హోదా ఉన్న వైద్యాధికారికి బినామీ పేర్లతో పలు ప్రాంతాల్లో మూడు ప్రైవేటు నర్సింగ్ హోంలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రికొచ్చిన ఓ రోగిని చికిత్స పేరుతో ఆరు నెలలుగా తన ప్రైవేటు ఆస్పత్రికి రప్పించుకుని రూ.1.50 లక్షలు ఖర్చు చేయించారు. మొదట కడుపునొప్పి అని శస్త్రచికిత్స చేయించారు. వ్యాధి నయం కాకపోవడంతో ఏకంగా గర్భ సంచినే తీసేశారు. ఆరోగ్యం కుదుటపడకపోవడంతో బాధితురాలు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు.

ఈనాడు, మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలో ఐదు జనరల్ ఆస్పత్రులు, 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, 89 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. జనరల్ ఆస్పత్రులు, సీహెచ్‌సీలు, డీఎంహెచ్‌వో కార్యాలయాల్లో పని చేసే కొందరు వైద్యుల పనితీరుపై తీవ్ర విమర్శలొస్తున్నాయి. కొందరు వైద్యులు సర్కారు దవాఖానాల్లో నిస్వార్థంగా రోగులకు సేవలందిస్తూ మంచిపేరు సంపాదించుకుంటుండగా మరికొందరు వ్యాపారమే లక్ష్యంగా పని చేస్తున్నారనే వాదనలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ప్రభుత్వాస్పత్రుల్లో ఉద్యోగాలు చేస్తూ రోగులకు మెరుగైన సేవలు అందించకుండా తమ ప్రైవేటు ఆస్పత్రులకు రప్పించుకుంటున్నారు. సాధారణంగా వైద్యులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆస్పత్రుల్లో విధులు నిర్వహించాలి. జనరల్ ఆస్పత్రుల్లో పని చేసే వైద్యులు మధ్యాహ్నం 2 గంటల వరకు పని చేస్తే తర్వాత మరో రెండు గంటల వైద్య కళాశాలలో తరగతులకు హాజరు కావాలి. ఆర్ఎంవోలు మూడు షిఫ్టుల్లో పని చేయాలి. పలు ఆస్పత్రుల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు పని చేసి విధుల నుంచి బయటకొస్తున్నారు. తర్వాత తమ ప్రైవేటు ఆస్పత్రులకు వచ్చి ఓపీ విభాగాలు చూడటం, ఇతర శస్త్ర చికిత్సలు చేస్తున్నారు.

● ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు తమకు కేటాయించిన సమయంలో తప్పనిసరిగా విధులు నిర్వహించాల్సిందే. ఆ సమయంలో ప్రైవేటు ఆస్పత్రులకెళ్లి చికిత్స చేయడం నిబంధనలకు విరుద్ధం. సర్కారు దవాఖానాలకొచ్చిన రోగులను ప్రైవేటు క్లినిక్‌లకు పంపించకూడదు. అత్యవసరం అనుకుంటే హైదరాబాద్ గాంధీ, ఉస్మానియా వంటి ఆస్పత్రులకు రిఫర్ చేయాలి.

-సంపత్‌కుమార్‌సింగ్, పర్యవేక్షకులు, మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి

హైదరాబాద్‌కు పంపించాల్సి ఉన్నా.. : జనరల్ లేదా ప్రాంతీయ ఆస్పత్రులకు రోగులు వచ్చినప్పుడు అక్కడ చికిత్స అందించే మార్గాలు లేకుంటే వైద్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రి లేదా ఉస్మానియా ఆస్పత్రికి రిఫర్ చేయాలి. ఉమ్మడి జిల్లాలో అలా జరగడం లేదు. ప్రభుత్వ వైద్యులు తాము ఏర్పాటు చేసుకున్న ప్రైవేటు నర్సింగ్‌హోంలకు రావాలని చెబుతున్నారు. శస్త్ర చికిత్సల పేరుతో రూ. లక్షల్లో బిల్లులు వసూలు చేస్తున్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయాలు, జనరల్ ఆస్పత్రుల్లో పని చేస్తున్న కొందరు గైనకాలజిస్టులు కాన్పుల కోసం వచ్చే వారిని ప్రైవేటుకు మళ్లిస్తూ శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. గతంలో వైద్యం వికటించడంతో ఉమ్మడి జిల్లాలో ఇలాంటి పలు సంఘటనలు వివాదాస్పదమయ్యాయి. అయినా పలువురు వైద్యుల్లో మార్పు రావడం లేదు.

ఖాళీలతో పట్టణ ప్రణాళిక కుదేలు

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు



భూత్పూర్ పురపాలక సంఘం

న్యూస్‌టుడే, పాలమూరు పురపాలకం : పురపాలికల్లో రెవెన్యూ తర్వాత అత్యంత కీలకమైన ప్రణాళిక విభాగాలు ఖాళీలతో కునారిల్లుతున్నాయి. సరైన యంత్రాంగం, పర్యవేక్షణ లేక పట్టణాల్లో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తూ అనేక సమస్యలకు కారణమవుతున్నాయి. పురపాలికల్లో ఇంజినీర్ల నియామకం చేపట్టిన గత ప్రభుత్వం ముఖ్యమైన ప్రణాళిక విభాగాన్ని పట్టించుకోలేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఒక ప్రత్యేక గ్రేడు పురపాలిక, 9 రెండో శ్రేణి పురపాలికలు, మరో 9 మూడో శ్రేణి పురపాలికలు ఉన్నాయి. వీటి పరిధిలో కీలకమైన చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 57 మంది టీపీబీవోలు పనిచేయాల్సి ఉండగా ఒక్కరు కూడా లేరు. ఇక పురపాలికకు కనీసం ఒకరు ఉండాల్సిన ట్రేసర్ పోస్టులు మొత్తం ఖాళీగానే ఉన్నాయి. ప్రణాళిక విభాగాల్లో సరైన సిబ్బంది లేని కారణంగా క్షేత్రస్థాయిలో పరిశీలన కుంటుపడి ఎక్కడికక్కడ అనుమతులు లేని నిర్మాణాలు వెలుస్తున్నాయి.

కీలక స్థానాల్లో ఇన్‌ఛార్జులు..

ప్రణాళిక విభాగాల్లో ఏసీపీ (అసిస్టెంట్ సిటీ ప్లానర్) తర్వాత టీపీవో (టౌన్ ప్లానింగ్ అధికారి), టీపీఎస్ (టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్), టీపీబీవో (టౌన్ ప్లాన్ బిల్డింగ్ అధికారి), ట్రేసర్ పోస్టులు కీలకం. ప్రత్యేక గ్రేడు పురపాలిక మహబూబ్‌నగర్‌కు రెండు ఏసీపీ పోస్టులు మంజూరు ఉండగా ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. మూడు టీపీబీవో పోస్టులకు గాను అన్నీ ఖాళీగా ఉన్నాయి. ఒక ట్రేసర్ పోస్టు కూడా ఖాళీగా ఉంది. సెకండ్ గ్రేడ్ పురపాలికలైన నారాయణపేట, వనపర్తి, గద్వాల, అయిజ, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, జడ్చర్లలో టీపీవో పోస్టులకు అనుగుణంగా ఒక్కో టీపీవో పనిచేస్తున్నారు. అచ్చంపేట, కొల్లాపూర్ పురాల్లో టీపీవో పోస్టులు ఉన్నా భర్తీ చేయలేదు. టీపీవోలు లేకపోవడంతో పక్క పురపాలికల టీపీవోలు ఇన్‌ఛార్జులుగా వారంలో రెండు రోజులు విధులు నిర్వహిస్తున్నారు. టీపీబీవోలు పదేళ్లుగా ఖాళీగానే ఉంటున్నాయి. ట్రేసర్ పోస్టులు ఎక్కడా లేవు.

కొత్త పురాలు గాలికి..

కొత్తగా ఏర్పాటైన పెబ్బేరు, కొత్తకోట, అమరచింత, కోస్గి, భూత్పూర్, మక్తల్, ఆత్మకూర్, వడ్డేపల్లి, అలంపూర్ పురపాలికల ప్రణాళిక విభాగాలను గత ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసింది. వాటికి ప్యాట్రన్ ప్రకారం ఒక టీపీవో, రెండు టీపీఎస్, మరో రెండు లేక మూడు టీపీబీవో, ఒక ట్రేసర్ పోస్టులు మంజూరు చేసి భర్తీ చేయాల్సి ఉండగా ఆ ఊసేలేదు. ఈ పురపాలికల్లో నారాయణపేట, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ పురపాలికల టీపీవోలు, టీపీఎస్‌లు వారంలో రెండు రోజులు పనిచేస్తూ నెట్టుకొస్తున్నారు.

హోదా	పోస్టులు	ఉన్నవారు
ఏసీపీ	02	01
టీపీవో	19	19
టీపీఎస్	27	12
టీపీబీవో	57	0
ట్రేసర్	19	0

నత్తనడకన చేప పిల్లల పంపిణీ



ఉప్పునుంతల : మర్యాద సముద్రంలో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ (పాత చిత్రం)


అచ్చంపేట న్యూటౌన్, బిజినేపల్లి, న్యూస్‌టుడే : మత్స్యకారుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా చేపట్టిన చేప పిల్లల పంపిణీ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఈ ఏడాది ఆశించిన దానికి మించి వర్షాలు కురిసినా చేప పిల్లల సరఫరాకు సకాలంలో టెండర్లు నిర్వహించలేదు. రెండుసార్లు నిర్వహించిన టెండర్లో ఎవరూ పాల్గొనలేదు. మూడోసారి టెండర్లు దక్కించుకున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు ఇటీవల చేప పిల్లల సరఫరా ప్రారంభించారు. సెప్టెంబరులో ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉన్నా ఆలస్యంగా అక్టోబరు 7న కొల్లాపూర్ సమీపం సింగోటం చెరువులో అధికారులు పంపిణీ ప్రారంభించారు.

మత్స్యకారుల్లో ఆందోళన..: నాగర్‌కర్నూల్ జిల్లాలోని 1,448 చెరువుల్లో 1.50 కోట్ల చేప పిల్లలను విడుదల చేయాల్సి ఉన్నా.. లక్ష్యం నెరవేరేలా లేదు. ఇప్పటి వరకు కొల్లాపూర్ మండలంలోని సింగోటం, బిజినేపల్లి మండలంలోని పాలెం, మంగనూర్, అచ్చంపేట మండలం చంద్రసాగర్, ఉప్పునుంతల మండలం కాంసానిపల్లి, లక్ష్మాపూర్‌లలోని చెరువుల్లో 5.40 లక్షల చేప పిల్లలను మాత్రమే వదిలారు. చేపపిల్లల పంపిణీ గడువు ముగిసిపోతున్నా... అధికారులు పట్టించుకోవడం లేదని సహకార సంఘాల వ్యక్తం చేస్తున్నారు. వనపర్తి, పెబ్బేరు పరిసర ప్రాంతాల్లో చేపపిల్లల నాణ్యతను పరిశీలించి సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మత్స్యకారులకు చేప పిల్లలను లెక్కించకుండా కవర్లలో వేసి ఇవ్వడంతో వేల సంఖ్యలో చనిపోతున్నాయని బల్మూరు మండలం బాణాల, బిల్లకల్లు, కొండనాగులలోని మత్స్యకారులు గతేడాది అభ్యంతరం వ్యక్తం చేశారు. చేపపిల్లల రవాణా, వాహనం అద్దె కూడా తామే భరిస్తున్నామని వాపోయారు. ఇప్పటికైనా పారదర్శకంగా వ్యవహరించాలని కోరుతున్నారు.

లక్ష్యాలను చేరుకుంటాం...

పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి లక్ష్యాలను చేరుకుంటాం. సమయానికి టెండరు ప్రక్రియ పూర్తికాకపోవడం వల్లనే పంపిణీ ఆలస్యమైంది. గుత్తేదారులతో మరోసారి మాట్లాడి త్వరగా పూర్తి చేస్తాం. చేప పిల్లల్లో నాణ్యతను పరిశీలించాకే సేకరిస్తున్నాం.

- రజని, మత్స్యశాఖ ఎ.డి. నాగర్‌కర్నూల్




(c) eenadu



నిధుల కోసమే ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణం బోర్డు

విలాసం ఖరీదు రూ.20 లక్షలు


వృథాగా మారిన షటిల్ కోర్టు

షటిల్ కోర్టుకు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్, సీసీ కెమెరా

ప్రభుత్వం నిధులు వృథా

చూడచక్కని షటిల్ కోర్టు.. చుట్టూ జాలి ఫెన్సింగ్, సీసీ కెమెరాలు, బోరు, విద్యుత్తు శాఖ నుంచి నియంత్రిక తదితర వసతులను చూసి ఇదేదో సామాన్యుల కోసం ఏర్పాటు చేసిన వసతులనుకున్నారా.. అయితే మీరు పొరబడినట్లే. వివరాల్లోకి వెళ్తే.. రెండేళ్ల క్రితం నాగర్‌కర్నూల్‌లో పనిచేసిన కలెక్టర్, అదనపు కలెక్టర్ ఆటవిడుపు కోసం కలెక్టరేట్‌కు సమీపంలో ఏర్పాటు చేసుకున్న క్రీడా మైదానం. పురపాలక సంఘంతో పాటు వివిధ శాఖల నుంచి దాదాపు రూ.20 లక్షలు సమీకరించారు. తెలంగాణ క్రీడా ప్రాంగణం పేరుతో షటిల్ కోర్టును ఏర్పాటు చేసుకున్నారు. తెలంగాణ క్రీడా ప్రాంగణం బోర్డు కూడా పెట్టారండోయ్.. అందులో ఆ ఇద్దరు జిల్లా అధికారులు మాత్రమే షటిల్ ఆడుకునేవారు. ఇతరులను అందులోకి అనుమతించలేదు. వారు బదిలీపై వెళ్లిన తర్వాత వినియోగించే వారు లేక పెట్టిన ఖర్చంతా వృథా అయింది. షటిల్‌కోర్టులో పిచ్చి మొక్కలు పెరుగుతుండటంతో ప్రభుత్వ నిధులు బూడిదలో పోసినట్లుగా మారిందని అందరికీ అందుబాటులోకి తెస్తే ప్రయోజనకరం ఉంటుందని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


- న్యూస్‌టుడే, నాగర్‌కర్నూల్

చిట్టి చేతులు.. చక్కని కవితలు


విద్యార్థులకు కవితల గురించి బోధిస్తున్న ఉపాధ్యాయుడు తగుళ్ల గోపాల్

న్యూస్‌టుడే, కల్వకుర్తి న్యూటౌన్

నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం అజిలాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఏకంగా తెలుగు కవితలు రాసి ఔరా అనిపించారు. తెలుగు ఉపాధ్యాయుడు, కవి తగుళ్ల గోపాల్ ప్రోత్సాహంతో దేవగన్నేరు పేరిట కవితల పుస్తకం ముద్రించడం ఆదర్శనీయం. తెలుగు ఉపాధ్యాయుడి మార్గదర్శనంలో చదువుతోపాటు కవితలు రాయడంలో విద్యార్థులు రాణిస్తున్నారు. 86 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో 3వ తరగతి నుంచి ఏడో తరగతి విద్యార్థులు 47 మంది సుమారు 60 కవితలు రాయడం విశేషం. 2012 నుంచి తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గోపాల్‌లో ప్రతి విద్యార్థి ఏడో తరగతి వరకు వంద పద్యాలు తప్పనిసరి నేర్చుకొని పట్టు సాధించేలా తర్ఫీదునిచ్చారు. తను కవితలు రాస్తూనే విద్యా బుద్ధులతో పాటు కవితలు రాయించాలనే సదుద్దేశంతో ప్రార్థన, సమయ సందర్భాన్ని బట్టి రాసే విధానాన్ని అలవర్చారు. ఇతర విద్యాసంస్థల విద్యార్థులు రాసే కవితలను చదివి విన్పించేవారు. ఆయా పదాలకు అర్థాలు వివరించడం, అర్థవంతమైన పదాలను వినియోగిస్తూ కవితలను ఎలా రాయలో నేర్పించారు. ఆ పల్లె విద్యార్థులు అమ్మతనం, ఊరు, అన్నదాత, స్నేహం, ఆడపిల్ల పుట్టికతో పాటు వివక్షత, వనలపై విద్యార్థులు రచించిన కవితలతో దేవగన్నేరు కవిత సంకలనం ముద్రించి ఆవిష్కరించారు. ఆయా కవితలు ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టించడంతో పాటు ఆలోచింప జేస్తున్నాయి. గోపాల్ సార్‌కు తెలుగు విభాగంలో 2021 సంవత్సరానికి దండకడియం అనే కవిత సంపుటిని రాసి కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం దక్కించుకున్నారు. తెలుగు ఉపాధ్యాయుడు గోపాల్‌తో పాటు హెచ్ఎం డేవిడ్‌రాజు, ఉపాధ్యాయులు ఆలువేలు, వనతి, శ్రీనువాసులు, జంగయ్య విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు.



వారంతా పల్లె విద్యార్థులే. తెలుగు ఉపాధ్యాయుడి మార్గదర్శనంలో పదాలతో అల్లుకుపోయారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులే అయినా.. భావాత్మకంగా అర్థవంతమైన కవితలు రాసి ఆదర్శంగా నిలిచారు. పుస్తకంగా ముద్రించి ఔరా అనిపించారు.



విద్యార్థులు ప్రచురించిన దేవగన్నేరు కవితల పుస్తకం


కవితలపై ఆసక్తి పెంచుకొని..: చిన్నప్పటి నుంచి చదవడం, రాయడం అంటే ఇష్టం. ఉపాధ్యాయులు చదువుతో పాటు కవితలు రాయడాన్ని నేర్పిస్తున్నారు. తోటి విద్యార్థులతో పోటీ పడి నేర్చుకుంటు రాస్తున్నాను. ఇంకా చాలా కవితలు రాయాలని ఉంది. ఏదో తరగతిలో పద్యాలు, కవితలు రాయడం మొదలు పెట్టా.. ఉపాధ్యాయుడు గోపాల్ ప్రోత్సహంతో కవితలు రాశా.

- గునగంటి ఈక్షిత, 7వ తరగతి


తెలుగు పద్యాలంటే ఇష్టం..: తెలుగు పద్యాలు నేర్చుకోవాలని మా ఉపాధ్యాయులు చెప్పారు. పద్యాల సాధనతో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఇష్టంతో నేర్చుకుంటూ కవితలు రాస్తున్నాను. మరిన్ని కవితలను రాసి గుర్తింపు తెచ్చుకుంటా. పాఠశాల అటెండర్ ఖాసీం తాతపై రాసిన కవిత అంటే నాకు చాలా ఇష్టం.

- గోరంట్ల రాధిక, 5వ తరగతి


మాతృభాషపై మమకారం..: ఇప్పటికే 40 పద్యాలతో పాటు పాటలు నేర్చుకున్నాను. మరిన్ని నేర్చుకోవాలని ఉంది, మాఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నేర్పించారు. చదువుతో పాటు పద్యాలు నేర్చుకోవాలనే ఆసక్తి పెరిగింది. ప్రతి రోజు సాధన చేసే వాళ్లం. పోటి పడి కవితలను రాస్తున్నాం

- కల్మొండ యోగీశ్వర్, 7వ తరగతి


కవితలు రాయాలనే తపన పెరిగింది..: తెలుగు ఉపాధ్యాయుడు కవితలు రాసేందుకు ప్రతి రోజు సాధన చేయించేవాడు. ఉపాధ్యాయుడు రోజు చెబుతు, రాయిస్తూ, పాడిస్తూండటంతో రాయాలనే తపన పెరిగింది. ఒకరిని మించి ఒకరం కవితలు రాస్తూ చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తున్నాం. ఇప్పటికి పది కవితలు రాయడం జరిగింది.

- కాలె జశ్వంత్, 6వ తరగతి

కరవైన నీడ.. కనికరం చూపరాదా!


వెంకటయ్య, చిట్టెమ్మ నివాసం ఉంటున్న వంటగది


ఇరుకు గదిలో వంట చేస్తున్న చిట్టెమ్మ

పదిహేనేళ్లుగా ఓ కుటుంబం పాఠశాల వంటగదిలో నివాసముంటూ అష్టకష్టాలు పడుతున్న దైన్యమిది. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం భట్టుపల్లి గ్రామానికి చెందిన తోకల వెంకటయ్య ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చాలా ఏళ్లుగా స్వీపర్‌గా పనిచేస్తున్నారు. అతడి భార్య చిట్టెమ్మ మధ్యాహ్న భోజన నిర్వాహకురాలిగా పనిచేస్తున్నారు. వీరికి గ్రామంలో ఉన్న ఇల్లు 2006లో కురిసిన వానలకు కూలిపోయింది. మళ్లీ ఇల్లు నిర్మించుకునే స్తోమత లేకపోవటంతో 2009 వరకు గ్రామంలో తెలిసిన వారి ఇళ్లల్లో తలదాచుకుంటూ వచ్చారు. ఆ తర్వాత గ్రామ పెద్దల అనుమతితో పాఠశాలలోని వంట గదిలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. 9 అడుగుల పొడవు, 6 అడుగుల వెడల్పు ఉండే ఆ ఇరుకు గదిలోనే పదిహేనేళ్లుగా నెట్టుకువస్తున్నారు. సంతానం లేకపోవడంతో చిట్టెమ్మ తమ్ముడి కుమార్తెని దత్తత తీసుకున్నారు. ఆ అమ్మాయి ప్రస్తుతం ఆరో తరగతి చదువుతోంది. ఆ గదిలో వారిద్దరు ఉండటమే కష్టం కావటంతో అమ్మాయిని బంధువుల ఇంటి వద్ద ఉంచి చదివిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో కొందరికి రెండు పడక గదుల ఇళ్లు మంజూరు చేసినా వీరికి ఇవ్వలేదు. ప్రస్తుత ప్రభుత్వమైనా కనికరించి ఇంటిని మంజూరు చేసి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

- ఈనాడు, మహబూబ్‌నగర్

కృష్ణా తీరంలో ఘర్షణ!

ఆదాయం విషయంలో ఇరు రాష్ట్రాల బోట్‌ల నిర్వాహకుల మధ్య గొడవలు


సోమశిల వద్ద బోట్లపై వెళ్తున్న ప్రజలు

కొల్లాపూర్, న్యూస్‌టుడే : కృష్ణా తీరంలో తెలుగు రాష్ట్రాల బోట్‌ల నిర్వాహకుల మధ్య తరచూ గొడవలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా ఉభయ రాష్ట్రాల పరిధిలో రాకపోకల కోసం ప్రత్యేకంగా ఘాట్‌లు ఏర్పాటు చేశారు. అందులో సభ్యత్వం ఉన్నవారే బోట్లను నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నారు. అయితే తెలంగాణ నుంచి ఏపీకి రాకపోకలు ఎక్కువ.. ఏపీ నుంచి తెలంగాణకు తక్కువగా ఉండటంతో సమస్య తలెత్తుతోంది. తెలంగాణ బోటు నిర్వాహకులే అధిక ఆదాయం ఆర్జిస్తున్నారని ఏపీ వారి అభిప్రాయం. దీంతో ఇరు ప్రాంతాల మధ్య నిత్యం గొడవలు చోటుచేసుకోవడం, కేసుల నమోదు కావడం జరుగుతోంది.

ఇక్కడ ఘాట్‌లు...: శ్రీశైలం జల విద్యుత్తు ప్రాజెక్టు నిర్మాణంతో తెలుగు రాష్ట్రాల్లోని పలు గ్రామాలు ముంపునకు గురయ్యాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలో అమరగిరి, సోమశిల, మంచాలకట్ట, మల్లేశ్వరం, జటప్రోల్, చిన్నంబావి మండలంలోని చెల్లెపాడు, పెద్దమారూర్, యాపర్ల, అలంపూర్ తీరంలోని గొంది మల్ల గ్రామాల్లో మరపడవలపై నది దాటించడానికి ఘాట్‌లు ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జానాల, సిద్ధేశ్వరం, సంగమేశ్వరం, కొండపాటూరు, తదితర ప్రాంతాల్లో ఘాట్‌లు ఉన్నాయి.

సమస్య ఇలా...: ప్రస్తుతం నది దాటించడానికి ఒక వ్యక్తికి రూ.50 నుంచి రూ.100 వరకు, ద్విచక్రవాహనానికి రూ.100 వరకు వసూళ్లు చేస్తున్నారు. దీంతో ఘాట్‌లో సభ్యత్వం ఉన్నవారు నెలకు రూ.వేలలో ఆర్జిస్తున్నారు. ఒక సోమశిల ఘాట్‌కే ఏడాదికి రూ.60లక్షల నుంచి రూ.80లక్షల వరకు ఆదాయం వస్తుండటం గమనార్హం. దీంతో ఒక ప్రాంతానికే ఆదాయం ఎక్కువగా వస్తోందని ఆరోపణలు, ఫిర్యాదులు చేసుకుంటున్నాయి.

త్వరగా వంతెన నిర్మించాలి...: ఇటీవలే సోమశిల, సిద్ధేశ్వరం ప్రాంతాల ఘాట్‌ల నిర్వాహకులు ఫిర్యాదులు చేసుకున్నారు. ఇప్పటికే నదిలో చేపల వేట విషయంలో, నీటి మట్టం తగ్గిన తర్వాత వేసవిలో ముంపు భూముల్లో పంట సాగుపై ఇరు ప్రాంతాల మధ్య ఘర్షణ తలెత్తుతోంది. త్వరగా వంతెన నిర్మాణం చేసి రాకపోకల సమస్య తీర్చాలంటూ ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు రాగానే పనులు..

సోమశిల వద్ద కృష్ణానదిపై వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించారు. అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపడుతాం.

- రాజేందర్, ఈఈ, జాతీయ రహదారుల సంస్థ

ధ్రువపత్రాల జారీలో జాప్యంపై యువతి నిరసన

మానవపాడు, న్యూస్‌టుడే : ధ్రువపత్రాలు జారీ చేయకుండా జాప్యం చేస్తున్నారని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఓ యువతి నిరసనకు దిగిన ఘటన మానవపాడు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మానవపాడు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన హైమావతి నాన్ క్రీమిలేయర్, ఓబీసీ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ ధ్రువపత్రాలు తీసుకోవడానికి సోమవారం ఉదయం 9 గంటల సమయంలో హైమావతి తండ్రితో కలిసి స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. కలెక్టరేట్‌కు వెళ్లిన తహసీల్దారు వహిదా ఖాతూన్ అక్కడి పని పూర్తయ్యాక మధ్యాహ్నం మండల రెవెన్యూ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే కార్యాలయం వద్ద నిరీక్షిస్తూ విసుగు చెందిన హైమావతి, ఆమె తండ్రి ధ్రువపత్రాల జారీలో ఎందుకు జాప్యం చేస్తున్నారని తహసీల్దారును నిలదీశారు. కొద్ది రోజులుగా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారంటూ కార్యాలయ ఉద్యోగులపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టాఫ్‌నర్స్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవడానికి సమయం దగ్గర పడుతోందని, దరఖాస్తుకు ధ్రువపత్రాలు జతపరచాల్సి ఉండగా సంతకాలు పెట్టకుండా తహసీల్దారు జాప్యం చేశారని ఆరోపిస్తూ హైమావతి గట్టిగా కేకలు వేస్తూ కన్నీటిపర్యంతమయ్యారు. ఏదో గొడవ జరుగుతోందని చుట్టుపక్కల వారు కార్యాలయం వద్దకు వచ్చి గుమిగూడారు. చివరకు తహసీల్దారు ధ్రువపత్రాలపై సంతకం పెట్టడంతో సమస్య సద్దుమణిగింది. తహసీల్దారుని 'న్యూస్‌టుడే' సంప్రదించగా నాన్ క్రీమిలేయర్ ధ్రువపత్రం ఒక్క రోజులో ఇవ్వడం సాధ్యం కాదని, ఆర్ఐ క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక ఇస్తే దాన్ని బట్టి జారీ చేస్తామని తెలిపారు. హైమావతి పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఒక్క రోజులోనే ధ్రువపత్రాలు జారీ చేశామని, తాను జాప్యం చేశానని ఆరోపించటం తగదని పేర్కొన్నారు.


యువతితో మాట్లాడుతున్న తహసీల్దారు వహిదా ఖాతూన్

అద్దె చెల్లించలేదని వసతి గృహానికి తాళం



గేటుకు తాళం వేయడంతో బయట ఉన్న వసతి గృహ సిబ్బంది

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : వనపర్తిలోని బీసీ బాలికల కళాశాల వసతి గృహం అద్దె చెల్లించలేదని మంగళవారం భవనం యజమాని రామకృష్ణ గేట్‌కు తాళం వేశారు. అందులో పని చేసే సిబ్బంది, వార్డెన్ రంజిత బయటే ఉండిపోయారు. వసతి గృహంలో 308 మంది విద్యార్థినులు అభ్యసిస్తున్నారు. దసరా సెలవులు ఇవ్వడంతో వారు సొంతూళ్లకు వెళ్లిపోయారు. మంగళవారం ఇద్దరు అమ్మాయిలు వచ్చి తాళం వేసి ఉండటాన్ని చూసి వెనక్కి వెళ్లిపోయారు. 21 నెలల నుంచి అద్దె బకాయి ఉందని, దాదాపు రూ.పది లక్షల పైగా రావాల్సి ఉందని భవన యజమాని తెలిపారు. ఈ విషయమై జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి బీరం సుబ్బారెడ్డిని 'న్యూస్‌టుడే' సంప్రదించగా అద్దె సమస్య గురించి ప్రతినెల ఉన్నతాధికారులకు నివేదిస్తున్నామని, ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదని తెలిపారు. సమస్య జేసీ దృష్టికి తీసుకెళ్లానని పేర్కొన్నారు.

EENADU Classifieds

PEOPLE CARE

OLD AGE HOME

ఒమేగా హోంకేర్ వంట / ఇంటిపని, వృద్ధులను, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం|| చూసుకొనుటకు మీ ఇంటి వద్దకే కేర్‌టేకర్స్‌ని పంపబడును. హైదరాబాద్. ✆ 89776 39664, 89776 39665.

FACULTY/ TEACHERS

Wanted English Teacher in School upto 7th. Contact: 88976 44222

MEDICAL

మహబూబ్ నగర్‌లోని హస్పిటల్ నందు ఆపరేషన్ థియేటర్‌లో ఓటి అసిస్టెంట్ మరియు వార్డు సిస్టర్‌గా పనిచేయుటకు మహిళలు కావలెను వివరాలకు: 9951777756.

SECOND SALE

మహబూబ్‌నగర్ క్లాక్ టవర్ కూడలిలో బట్టల షాప్‌కు, కిరాణా షాప్, మెడికల్ షాప్, మొబైల్ షాప్‌కు అనుకూలమైన ఫుల్ ఫర్నీచర్ అమ్మబడును. ✆ 9182822108

Book Your 5 Lines Classified Advertisement for
B&W Rs. 335/- Only
Colour Rs. 395/- Only
GST 5% Extra
For further details Contact : Mahabubnagar 8008709794

JOBS

Medical Representatives Required urgently. Work @ Mahbubnagar Ph: 7032640251 E: cortexlabspvtltd@gmail.com

అప్పాజిపల్లి ఐరన్ కంపెనీ నందు Admin Officerగా పనిచేయుటకు 12th చదివిన 60 సం॥ లోపు వయస్సుగల Ex-Serviceman కావలెను. జీతం 24000+Boarding & Lodging సంప్ర. సెల్: 9010800660

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు॥ ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15-40 వేలు. ఫ్రీ రూమ్ - బో॥ Hyd. ✆ 7995365999.

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషెంట్స్ / చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం 18K. ✆ 96402 58899, 96404 68899.

శ్రీనివాస హోమ్‌కేర్‌లో పెద్దవారికి సేవలు చేయుటకు Exp. స్త్రీ/పురుషులు/ నర్సులు కావలెను. జీతం: 20,000/- నుండి 25,000/- వరకు ఇవ్వబడును. Hyd. లో. ✆ 6301330889, 6300799407.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్ - లిస్టులో ఉంచే మరియు / లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell:8008709794
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell:8008001824

కేఎల్ఐ కాలువలో పడి రైతు మృతి

బిజినేపల్లి, న్యూస్‌టుడే : కేఎల్ఐ కాలువలో ఏర్పాటుచేసిన వ్యవసాయ బోరు మోటారుకు మరమ్మతులు చేస్తున్న రైతు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందిన సంఘటన బిజినేపల్లి మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. శాయిన్‌పల్లి గ్రామానికి చెందిన వెంకటస్వామి (48) తన పొలం వద్ద కేఎల్ఐ కాలువలో ఏర్పాటు చేసిన బోరు మోటారులో ఇరుక్కున్న నాచు తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు కాలువలో పడి పోయాడు. నీటిలో మునుగుతుండగా పక్క పొలంలోని రైతులు కాపాడే యత్నం చేసినప్పటికీ ప్రవాహం అధికంగా ఉండటంతో ఆచూకీ లభించలేదు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రెస్క్యూ టీం గాలించి మృతదేహాన్ని వెలికితీశారు. వెంకటస్వామికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.

నేటి నుంచి కళోత్సవం

ఆరు అంశాల్లో పోటీల నిర్వహణ


బల్మూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినుల నృత్య ప్రదర్శన

అచ్చంపేట, న్యూస్‌టుడే : విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసి ప్రోత్సహించేందుకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను ఎంపిక చేయనున్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో వివిధ కళల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 16, 17 తేదీల్లో రెండు రోజుల పాటు జిల్లా స్థాయిలో కళా ఉత్సవ్ పేరుతో పోటీలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు పోటీలు నిర్వహించి ప్రోత్సహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఇవీ పోటీలు నిర్వహించే అంశాలు : విద్యాశాఖ ఆధ్వర్యంలో అధికారులు విద్యార్థులకు ఆరు అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. నృత్యం, వోకల్ మ్యూజిక్, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, సంప్రదాయ కథలు చెప్పడం, థియేటర్, విజువల్ ఆర్ట్స్ అనే అంశాల్లో పోటీలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో 9, 10 తరగతులు, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటి జాతీయ స్థాయికి ఎంపికై విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు. ఈ పోటీల్లో ఒక్కో విద్యా సంస్థ నుంచి ఒక్కో విభాగంలో ఒకరు నుంచి ఐదు మంది విద్యార్థులు విజువల్ ఆర్ట్స్‌లో ఒక విద్యార్థి, సంప్రదాయ కథలు చెప్పే పోటీలో ఒక్కో విద్యా సంస్థ నుంచి ఇద్దరు విద్యార్థులు పాల్గొన వచ్చు. పాల్గొనేందుకు అనుమతిస్తారు. విద్యాశాఖ అధికారులు పోటీల సమాచారాన్ని అన్ని పాఠశాలలు, కళాశాలలకు పంపించారు. ఈ నెల 16, 17 తేదీల్లో జిల్లా, నవంబరు 1, 2 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నరసింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యార్థులకు ప్రోత్సాహం

కళా ఉత్సవ్ పోటీల్లో పాల్గొనేలా విద్యార్థులకు సమాచారం ఇచ్చి ప్రోత్సహించేలా అన్ని యాజమాన్యాల పరిధిలోని విద్యా సంస్థల ప్రధానోపాధ్యాయులు, ప్రధానాచార్యులకు సమాచారం అందించాం. ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించి పోటీల్లో పాల్గొనేలా శ్రద్ధ తీసుకోవాలని సూచించాం. ఈ నెల 16, 17 తేదీల్లో నాగర్‌కర్నూలులోని జాతీయోన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించనున్నాం. ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా విద్యా సంస్థల అధిపతులు శ్రద్ధ తీసుకోవాలి.

- డా.గోవిందరాజులు, డీఈవో, నాగర్‌కర్నూలు

ఉమ్మడి జిల్లాలో ఉన్నత పాఠశాలలు	జూనియర్ కళాశాలలు	విద్యార్థులు
1,008	86	67,893

వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయండి



మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిరాహార దీక్ష చేస్తున్న జూనియర్ డాక్టర్లు, మద్దతు తెలిపిన వైద్యులు

పాలమూరు, న్యూస్‌టుడే : కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థినిని హత్యాచారానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని జూనియర్ డాక్టర్ల(జూడాల) సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఒక రోజు నిరహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి అక్కడి వైద్య విద్యార్థులు, వారి ప్రతినిధులతో చర్చలు జరిపినా కేసులో ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేకపోవటం శోచనీయమన్నారు. నేతలు అభిలాష్, అభిషేక్, కావ్య, ఐఎంఏ నాయకులు డా.బాల శ్రీనివాస్, డా.సునీల్, డా, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో కొత్త కోర్సులు

పాలమూరు : మహబూబ్‌నగర్ పట్టణం పిల్లలమర్రి రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కొత్త కోర్సులను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ గోపాల్‌నాయక్ పేర్కొన్నారు. మ్యానుఫ్యాక్చరింగ్ కంట్రోల్ ఆటోమేషన్(ఏడాది కాల వ్యవధి), ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్(ఏడాది కాల వ్యవధి), ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్ మెకానికల్(ఏడాది కాల వ్యవధి), బేసిక్ డిజైనర్ వర్చువల్ వెరిఫైర్ మెకానికల్(రెండేళ్లు), అడ్వాన్స్ సీఎన్‌సీ టెక్నీషియన్(రెండేళ్లు), మెకానికల్ ఎలక్ట్రిక్ వెహికల్(రెండేళ్లు) తదితరాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు iti.telangana.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 83742 50330 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	126–00
రిటైల్	148–00
డ్రెస్డ్	215–00
స్కిన్‌లెస్	244–00

(c) eenadu


ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ఊరేగింపు

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని హనుమాన్ కాలనీలో ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ఘనంగా పూజలు నిర్వహించారు. నంది, శివలింగం, గణపతి, పార్వతి, నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ఠించడానికి భక్తులు ఊరేగింపుగా వెళ్లారు. పురపాలిక అధ్యక్షురాలు రమ్యకుమారి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత చీరల వేలం

అచ్చంపేట గ్రామీణం, న్యూస్‌టుడే : సింగారం గ్రామంలో వీరహనుమాన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం దుర్గామాత అమ్మవారి చీరలను వేలం వేయగా రూ.1.3లక్షలు పలికాయి. దుర్గామాత అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి చీరలను రూ.75వేలకు దక్కించుకున్నారు. అమ్మవారి ముక్కు పుడకను కోట్ల సత్యమయ్య రూ.45వేలకు దక్కించుకున్నారు.

మొక్కజొన్న క్వింటా గరిష్ఠ ధర రూ.2,269

అచ్చంపేట, న్యూస్‌టుడే : అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న క్రయవిక్రయాలు మంగళవారం నిర్వహించారు. క్వింటా గరిష్ఠ ధర రూ.2,269, మాదిరి ధర రూ.2,268, కనిష్ఠ ధర రూ.1,711 చొప్పున రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేశారు.

ధరణిలో భూమి కనిపించడం లేదని ఫిర్యాదు

వెల్దండ, న్యూస్‌టుడే : తనపట్టా భూమి ధరణిలో కనిపించడం లేదని, భూమి తన పేరుపైకి మార్చాలని కోరుతూ మంగళవారం బాధితురాలు మహిళ తహసీల్దార్ కార్తిక్‌కుమార్‌కు ఫిర్యాదు చేసింది. మండల పరిధిలోని చెర్కూరు రెవెన్యూ గ్రామ శివారులో 76, 82, సర్వే నంబర్లలో 0.21 గుంటల పట్టాభూమి ఉందన్నారు. ఆ భూమి ప్రస్తుతం ధరణిలో కనిపించడం లేదని, ఇతరుల పేరుపైకి మార్చారన్నారు. భూమి తన పేరుపైకి మార్చి న్యాయం చేయాలని కోరుతు హైదరాబాద్‌కు చెందిన మాధవి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసింది.

స్థల పరిశీలన

కొల్లాపూర్, న్యూస్‌టుడే : గురుకుల పాఠశాల భవనాల నిర్మాణాలకు పరిదేల రెవెన్యూ శివారులో సర్వే నంబర్ 56లో ప్రభుత్వ భూమిను పరిశీలించినట్లు కొల్లాపూర్ తహసీల్దార్ విష్ణువర్ధన్‌రావు తెలిపారు. జిల్లా అధికారులకు నివేదిక పంపామన్నారు.

సీసీఐ కొనుగోళ్లు ప్రారంభించాలి

తెలకపల్లి, న్యూస్‌టుడే : సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. జిల్లాలో వేలాది ఎకరాల్లో సాగు చేసిన పత్తి పంటను దళారులకే విక్రయిస్తున్నట్లు చెప్పారు. సీసీఐ కొనుగోళ్లు ప్రారంభిస్తామని అధికారులు ప్రకటనలు చేసినా అమలు కావడం లేదన్నారు.

తీరని పరిహారం సమస్య

ఇళ్లు ఖాళీ చేయని నిర్వాసితులు

కొల్లాపూర్, న్యూస్‌టుడే : పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో ముంపు గ్రామాల సమస్య తీరడంలేదు. పథకంలో భాగంగా కొల్లాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో వేలాది ఎకరాలు ముంపునకు గురయ్యాయి. మెరుగైన పరిహారం ఇవ్వాలంటూ నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు. ఇళ్లను సైతం ఖాళీ చేయకుండా ఉంటున్నారు.


నార్లాపూర్ జలాశయంలో ముంపునకు గురైన సున్నపుతండా

పునరావాసం కల్పించాలని.. : ఎత్తిపోతల పథకంలో భాగంగా కొల్లాపూర్ మండలంలోని సున్నపుతండా, దుల్యానాయక్‌తండా, అంజనగిరి, వడ్డెగుడిసెలు, తదితర గ్రామాలు ముంపునకు గురయ్యాయి. వీరికి 2017-18లో జీవో 123 ప్రకారం 199 ఇళ్లు, 2,400 ఎకరాలకు పరిహారం చెల్లించారు. 2020-21లో జీవో 120 ప్రకారం 117 ఇళ్లకు పరిహారంతో పాటు పునరావాసం కల్పిస్తామని చెప్పారు. తమకు కూడా మెరుగైన పరిహారంతో పాటు పునరావాసం కల్పించాలంటూ మొదటి జీవో నిర్వాసితులు కోరుతున్నారు. అందులో భాగంగానే సున్నపుతండాలో ఇళ్లను ఖాళీ చేయలేదు.

పనులపై ప్రభావం.. : అసైన్డ్, లావుణి తదితర భూములకు పరిహారం చెల్లించలేదు. ఎల్లూరు శివారులో 57 ఎకరాలు, నార్లాపూర్ శివారులో 70 ఎకరాలు ఉండగా రిజర్వు ఫారెస్ట్‌లో 84 ఎకరాలు ఉంది. వీటికి అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసినా పరిహారం చెల్లించలేదు. దీంతో పలువురు నిర్వాసితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేయడం, కోర్టుకు వెళ్లడం, నిరసన కార్యక్రమాలను చేస్తున్నారు. ఈ సమస్యలతో పాలమూరు ఎత్తిపోతల పథకంలో సొరంగం, పంపుహౌస్, నార్లాపూర్ జలాశయం, అప్రోచ్ కాల్వ పనులు పూర్తవడం లేదు.

● ఈ సమస్యపై సంబంధిత ప్రాజెక్టు ఈఈ శ్రీనివాసరెడ్డి స్పందిస్తూ.. నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. మెరుగైన పరిహారం చెల్లింపునకు ప్రతిపాదనలు చేశామని చెప్పారు.



అచ్చంపేట: అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నేతలు.. లింగాల: ఉన్నత పాఠశాలలో...

కలాం ఆశయాలు యువతకు ఆదర్శం

అచ్చంపేట, న్యూస్‌టుడే : అచ్చంపేట అమరవీరుల స్తూపం వద్ద అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎన్‌ఎస్‌యూఐ డివిజన్ అధ్యక్షుడు మహబూబ్ అలీ, చందు, గౌస్ పాషా, అంజి, శ్రీరాంనాయక్, వెంకటేష్, రాజు, రఘు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

లింగాల, న్యూస్‌టుడే : లింగాల ఉన్నత పాఠశాలలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హెచ్‌ఎం అబ్దుల్ హమీద్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే : ప్రపంచం గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్త అబ్దుల్‌కలాం యువతకు మార్గనిర్దేశకుడని ఎంఈవో సత్యనారాయణశెట్టి అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో ఏపీజే అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు. కలాం జయంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ ఆయన స్ఫూర్తితో ముందుకుసాగాలన్నారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, శాంసన్, అరుణ, అనిత, అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బిజినేపల్లి, న్యూస్‌టుడే : మాజీ రాష్ట్రపతి డా. అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కారుకొండ, గంగారం పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఉపాధ్యాయులు ఆయన దేశానికి చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు.

కందనూలు, న్యూస్‌టుడే : భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలు సాధించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ అన్నారు. పట్టణంలోని ఆసంఘం కార్యాలయంలో మంగళవారం అబ్దుల్ కలాం జయంతి ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి యుగంధర్‌రెడ్డి, సభ్యులు పాండు, వెంకట్‌రెడ్డి, శ్రీను, వీరేశలింగం తదితరులు పాల్గొన్నారు.


నాగర్‌కర్నూల్ : ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

తారు రహదారి నిర్మాణానికి అంచనాలు


రహదారిని కొలుస్తున్న యువకులు

చారకొండ (వెల్దండ (గ్రామీణం), న్యూస్‌టుడే: చారకొండ మండల కేంద్రం నుంచి వెల్దండ మండలం భైరాపూర్ గ్రామం వరకు, గోకారం బస్సు స్టేజి నుంచి చంద్రాయనిపల్లి వరకు కొత్తగా తారు రహదారి నిర్మాణానికి పంచాయత్‌రాజ్ శాఖ ఏఈ దివ్య మంగళవారం అంచనాలు వేశారు. మండల కేంద్రం నుంచి మండల పరిధిలోని చంద్రాయనిపల్లి, భైరాపూర్ గ్రామం వరకు 13 కిలో మీటర్ల రహదారి, గోకారం బస్సుస్టేజి నుంచి గోకారం, చంద్రాయనిపల్లి వరకు 7కిలో మీటర్ల రహదారితో పాటు కల్వర్టుల నిర్మాణాలను ఏఈ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపుతామని ఏఈ పేర్కొన్నారు. కార్యక్రమంలో భాజపా నాయకులు శ్రీను, వెంకటేశ్‌గౌడ్, రామకృష్ణగౌడ్, అంజయ్య, బాల్‌చంద్రం, అన్వేష్‌కుమార్, తిరుతపయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలని వినతి

అచ్చంపేట, న్యూస్‌టుడే : జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలని మంత్రి జూపల్లి కృష్ణారావును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేసినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గంగాపురం రాజేందర్ తెలిపారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసినట్లు చెప్పారు. ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, నాగర్‌కర్నూలు ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రాజేందర్‌ను అభినందిస్తున్న మంత్రి జూపల్లి

పంచలింగాల ఆలయాభివృద్ధికి చర్యలు


పనులను ప్రారంభిస్తున్న ఛైర్మన్ మాధవరెడ్డి

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : మండల పరిధిలోని శ్రీభోగమహేశ్వరం (ఉమామహేశ్వరం)లో పంచలింగాల ఆలయ పెండింగ్ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు దేవస్థాన ఛైర్మన్ మాధవరెడ్డి అన్నారు. మంగళవారం మండపం, ధ్వజ స్తంభం, ఆలయ తలుపుల పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. జనవరిలో నిర్వహించే బ్రహ్మోత్సవాల వరకు పనులు పూర్తి చేస్తామన్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాస్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలి


ఆర్డీవో మాధవికి వినతిపత్రం అందజేస్తున్న కళాశాలల యాజమాన్యాలు

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని ప్రయివేటు కళాశాలల యాజమాన్యాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు మంగళవారం ఆర్డీవో మాధవిని కలిసి వినతి పత్రం అందజేశారు. అచ్చంపేట ప్రాంతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు అధికంగా ఉన్నారని, వారు ఫీజులు కట్టలేకపోతున్నారని చెప్పారు. వెంకటేశ్వర్లు, రవి, నిరంజన్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధోత్సవం

చారకొండ (వెల్దండ (గ్రామీణం), న్యూస్‌టుడే : జూపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి గ్యార్వీ వేడుకల్లో భాగంగా మహబూబ్‌సుభానీ దర్గా గంధోత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేకంగా ఒంటెను అలంకరించి గంధాన్ని ఉంచి బ్యాండ్ మేళాలతో పురవీధుల గుండా ఊరేగించారు. దర్గాలో భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేసి గంధం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నాయకులు భాస్కర్‌రావు, వెంకటయ్యయాదవ్, బాలేమియా, సాయికుమార్, ముస్తాఫా, సీరాజ్, బాల్‌రాజ్, రియాజ్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.


ఒంటెపై గంధం ఊరేగిస్తున్న గ్రామస్థులు

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

నాగర్‌కర్నూలు	7993300530
అచ్చంపేట	8008573927
కల్వకుర్తి	9908803650
కొల్లాపూర్	8008573870



? నాగర్‌కర్నూల్ పట్టణంలోని స్నేహపురి కాలనీలో ఇటీవలి కాలంలో కురిసిన వర్షాలకు వర్షపు నీరు ఇళ్ల మధ్య నిల్వగా ఉన్నాయి. రాత్రి సమయంలో దోమల బెడద తీవ్రంగా ఉంది.

- శివకుమార్, నాగర్‌కర్నూల్

✔ ఇళ్ల మధ్య నుంచి వర్షపు నీరు పోయేలా చర్యలు తీసుకుంటాం.

- నరేశ్‌బాబు, పురపాలక సంఘం కమిషనర్, నాగర్‌కర్నూల్



? కురుస్తున్న వర్షాలకు రహదారులు దెబ్బతిన్నాయి. కొల్లాపూర్ నుంచి రామాపురం వెళ్లే రోడ్డు మధ్యలో ప్రభుత్వ బాలికల జూనియర్, డిగ్రీ కళాశాల భవనాల సమీపంలో రహదారి శిథిలమైంది. ప్రమాదాల బారిన పడుతున్నాం.

- చంద్రయ్య, ద్విచక్ర వాహనచోదకుడు

✔ వెంటనే రహదారిని పరిశీలించి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపుతాం.

- రమాదేవి, డీఈ, రోడ్లు, భవనాలశాఖ, కొల్లాపూర్

– న్యూస్‌టుడే, కొల్లాపూర్


నాగర్‌కర్నూల్ : పట్టణంలోని 5వ వార్డులో రహదారిపై బురద

అయిదో వార్డులో అన్నీ అవస్థలే!

కందనూలు, న్యూస్‌టుడే : పురపాలక సంఘం పరిధిలోని 5వ వార్డు నాగనూల్ పరిధిలో పూర్తి స్థాయిలో సీసీ రహదారుల నిర్మాణాలు చేపట్టలేదు. కాలనీలోని మట్టి రహదారులు చిన్నపాటి వర్షానికి బురదగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాల్వలు నిర్మించకపోవడం వలన మురుగు ఇళ్ల మధ్య నిల్వగా ఉంటున్నాయి. కాలనీలోని పరిసరాలు అపరిశుభ్రంగా మారడం వలన రాత్రి సమయంలో దోమల బెడద తీవ్రంగా ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పురపాలక శాఖ అధికారులు దృష్టికి తీసుకపోయిన పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కాలనీలో వివిధ రకాల అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతున్నారు. ఈ సమస్యను పురపాలక సంఘం కమిషనర్ నరేశ్‌బాబు దృష్టికి తీసుకపోగా కాలనీలో సీసీ రహదారుల నిర్మాణాలు చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.



రహదారి అస్తవ్యస్తం

లింగాల, న్యూస్‌టుడే : ఇది లింగాల - చెన్నంపల్లి రహదారి. కంకర పరిచి ఇలా అసంపూర్తిగా వదిలేశారు. అవుసలికుంట - శాయినిపేట దారి పరిస్థితి కూడా ఇలాగే ఉంది. నిధులు లేకపోవడంతోనే పనులు నిలిచినట్లు చెబుతున్నారని, ఎమ్మెల్యే వంశీకృష్ణ చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దారులు ఇలా ఉండడంతో ఆయా గ్రామాలకు బస్సులను సైతం నిలిపివేశారంటున్నారు.

అంతర్గతం.. అధ్వానం

మురుగు ఇళ్లలోకి వస్తుండటంతో ఇబ్బంది

తెలకపల్లి, న్యూస్‌టుడే : ప్రధాన రహదారి నుంచి రాణావైపు అంతర్గత రహదారి వెంట కొన్ని సంవత్సరాల క్రితం నిర్మాణం చేసిన భూగర్భ మురుగునీటి కాల్వల్లో తక్కువ సైజు సిమెంటు పైపులు వేసి అక్కడక్కడా మ్యాన్‌హాల్స్ తెరిచి ఉంచారు. అవసరమైప్పుడు చెత్త చెదారాన్ని తొలగించేందుకు వాటిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో వరద తాకిడి ఎక్కువై భూగర్భ కాల్వ నుంచి మురుగు మ్యాన్ హాల్స్ నుంచి బయటకు వచ్చి, సీసీ దారిపై నుంచి సమీపంలోని ఇళ్లలోకి చేరుతోంది. రహదారులపై నిత్యం మురుగు ప్రవాహంతో రాకపోకలకు విద్యార్థులు, తదితరులు అవస్థలు పడుతున్నారు. బస్టాండ్ వెనుక ఏర్పాటు చేసిన భూగర్భ మురుగు కాల్వ పరిస్థితి ఇలాగే ఉంది.

లోపమే శాపం.. : తెలకపల్లి కాలనీల్లో అంతర్గత మురుగు కాల్వ వ్యవస్థ ఏర్పాటు సమయంలో ప్రజలు పట్టించుకోలేదు. ఇంజినీరింగ్ అధికారుల ప్రణాళిక లోపంతో చాలా చోట్ల ఇవే సమస్యలు ఎదురవుతున్నాయి. భూగర్భ మురుగు నీటి కాల్వల నిర్మాణంలో మూడు అడుగుల సిమెంట్ పైపులు వేయాల్సిన చోట రెండు అడుగుల పైపులు వేయడంతో సమస్య తలెత్తింది. భూగర్భ మురుగు నీటి కాల్వలు తిరిగి నిర్మించే పరిస్థితి లేదు. ప్రస్తుతానికి పరిశీలించి ఆయా చోట్ల కాల్వల్లో చెత్త చెదారం తొలగించి శుభ్రం చేస్తామని పంచాయతీ కార్యదర్శి భాస్కర్ పేర్కొన్నారు.


తెలకపల్లి రాణా దారిలో భూగర్భ మురుగు కాల్వ

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కల్వకుర్తి, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్‌లో ఏర్పాటు చేశామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఛైర్మన్ జనార్దన్ రెడ్డి కోరారు. మంగళవారం కల్వకుర్తి పీఏసీఎస్ కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి మాట్లాడారు. ఏ గ్రేడు ధాన్యం క్వింటా ధర రూ.2,320 అందిస్తామన్నారు.

తెరపై ఈనాడు

నాగర్‌కర్నూల్‌లో.. రవి : **దేవర.** రమణ : **వేట్టయన్ ద హంటర్.** రామకృష్ణ : **విశ్వం.**
కల్వకుర్తిలో.. పార్థసారథి : **దేవర.** అశోక్ : **వేట్టయన్ ద హంటర్**

అభ్యర్థికి న్యాయం చేయాలి

కందనూలు, న్యూస్‌టుడే : డీఎస్సీ 2024 ప్రక్రియలో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం వలన ఓ అభ్యర్థికి అన్యాయం జరిగిందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ శర్మ ఆరోపించారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ దేవసహాయంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడారు. అభ్యర్థులకు నిర్వహించిన కౌన్సిలింగ్ ప్రక్రియలో భాగంగా సోషల్ స్కూల్ అసిస్టెంట్‌లో కౌన్సెలింగ్ హాల్ ఎదుట ప్రదర్శించిన ఖాళీల వివరాల్లో కుమ్మెర జడ్పీ ఉన్నత పాఠశాల వివరాలు లేకపోవడం, హాల్‌లో ప్రదర్శించిన జాబితాలో పాఠశాల పేరు ఉండటం వలన ఆస్థానంలో కేటాయించాల్సిన అభ్యర్థులకు మంచి ర్యాంకులు ఉన్నా.. దూర ప్రాంతాల్లోని పాఠశాలకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా జాబితా ప్రదర్శించడంతో పాటు తక్కువ ర్యాంకు వచ్చిన అభ్యర్థికి కుమ్మెర పాఠశాల కేటాయించడం సరైన విధానం కాదన్నారు. ఉన్నతాధికారులు విచారణ నిర్వహించి అభ్యర్థికి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్. కృష్ణ పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

ఉప్పునుంతల, న్యూస్‌టుడే : విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా ఉప వైద్యాధికారి డా.తారాసింగ్ హెచ్చరించారు. స్థానిక ఆసుపత్రిలో సిబ్బందితో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. సమావేశంలో ఆయా కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. వైద్యాధికారి డా.స్వప్న, ఎంపీహెచ్‌వో బిక్కులాల్, మధునాయక్, మధు, పర్యవేక్షకులు ప్రభావతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉప వైద్యాధికారి డా.తారాసింగ్

కూరగాయల ధరలు కిలో... రూ.లలో



కందనూలు, న్యూస్‌టుడే : టమాటా 65, వంకాయ 40, బెండ 45, మిరప 90, కాకర 65, బీర 65, క్యాలిఫ్లవర్ 68, క్యాబేజీ 48, క్యారెట్ 65, దొండ 50, ఆలుగడ్డ 45, గోకర 64, దోస 40, ఆనంకాయ 16, చిక్కుడు 66, మునగకాయ 80, బీట్‌రూట్ 50, ఖీర, 45, బీన్స్ 90


జనుంపల్లిలో మురుగు కాల్వ, సీసీ రోడ్డు ధ్వంసమైన దృశ్యం


కోడేరు ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు దుస్థితి

మురుగు కాల్వలు శిథిలం

కోడేరు, న్యూస్‌టుడే : మిషన్ భగీరథ పైప్‌లైన్‌ల కోసం గతంలో రహదారులు, మురుగు కాల్వలు తవ్వి తాత్కాలిక మరమ్మతులు చేశారు. కోడేరులోని ఎస్సీ కాలనీ, జనుంపల్లి గ్రామాల్లో మరమ్మతులు చేసిన దారులు, కాల్వలు శిథిలావస్థకు చేరాయి. దీంతో మురుగు దారిపైకి చేరుతోంది. విషయంపై ఎంపీడీవో శ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. కోడేరు ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డుకు రూ.50లక్షలు మంజూరు చేస్తేనే సమస్య తీరుతుందన్నారు. ప్రస్తుతం రూ.8 లక్షలు ప్రతిపాదించామన్నారు. జనుంపల్లి గ్రామాన్ని సందర్శించి చర్యలు తీసుకుంటామన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

చారకొండ (వెల్దండ (గ్రామీణం), న్యూస్‌టుడే : చారకొండ మండలం గోకారం గ్రామానికి చెందిన లక్ష్మమ్మ మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను మంగళవారం సింగిల్‌విండో ఛైర్మన్ భాస్కర్‌రావు పరామర్శించారు. కుటుంబసభ్యులకు రూ. 20వేల ఆర్థికసాయం అందించారు. నాయకులు వెంకటయ్యగౌడ్, సాయికుమార్, ఆంజనేయులు, పరశురాములు పాల్గొన్నారు.

పశు పోషణలో జాగ్రత్తలు అవసరం

వెల్దండ : రాచూరు, భైరాపూర్, కొట్ర, తిమ్మినోనిపల్లి గ్రామంలో మంగళవారం గాలికుంటు వ్యాధి నిరోధక టీకా పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా పశువైద్యాధికారి రమేశ్ పరిశీలించారు. వైద్యసిబ్బందికి సూచనలిచ్చారు. మండల పశువైద్యాధికారి శ్రీనాథ్, సిబ్బంది నరేశ్‌రెడ్డి, వెంకన్న, రియాజ్, శ్రీను, నర్సింహ పాల్గొన్నారు.

అచ్చంపేటలో నీటి ఎద్దడి

అచ్చంపేట, న్యూస్‌టుడే : అచ్చంపేట పురపాలిక పరిధిలో నీటి ఎద్దడి నెలకొంది. నెల రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు ఐదారు రోజులకు ఓ సారి సరఫరా అవుతోంది. కనీస అవసరాలకు ప్రయివేట్ వ్యాపారుల వద్ద రెండు డ్రమ్ముల నీటిని రూ.300కు కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోతున్నారు. పుర అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు.

వెలగని ఆకాశ దీపాలు

కోడేరు, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని బస్టాండు కూడలిలో ఉన్న ఆకాశ దీపాలు నెల రోజులుగా వెలగడంలేదు. దీంతో ఆ ప్రాంతంలో రాత్రివేళలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎంపీడీవో శ్రావణ్‌కుమార్‌ను సంప్రదించగా... పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం తగదు

లింగాల, న్యూస్‌టుడే : గ్రామ కార్యదర్శులు స్థానికంగా ఉంటూ పారిశుద్ధ్యంపై చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఆంజనేయులు సూచించారు. మంగళవారం గ్రామ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధి పనులను పరిశీలించి నాణ్యతగా చేపట్టాలన్నారు. ఎంపీవో చంద్రశేఖర్, ఏపీవో ఇమాం తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి శిక్ష పొడిగింపు

బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే : సైబర్ క్రైం నిందితుడికి శిక్షను పొడిగించినట్లు ఎస్సై గురుస్వామి తెలిపారు. ఆయన కథనం ప్రకారం... మండలంలోని కొండనాగులకు చెందిన శ్రీధర్‌రెడ్డిని చరవాణి ద్వారా నమ్మించి రూ.38,083 చోరీ జరిగిన ఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు ఇది వరకే కేసు నమోదైంది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జగ్గయ్యపేట ప్రాంతానికి చెందిన కృష్ణకాంత్ (జయరాం)ను నిందితుడిగా గుర్తించారు. అయితే ఇప్పటికే మరో కేసులో కారాగారంలో ఉన్న నిందితుడిని మంగళవారం పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి విజయ్‌కుమార్ ఎదుట హాజరుపర్చారు. దీంతో మూడు నెలల అదనపు జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సై చెప్పారు.

అంగన్‌వాడీలో చోరీ

ఊర్కొండ, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ ఘటన మండలంలోని జకినాలపల్లిలో చోటు చేసుకుంది. ఆయా జంగమ్మ కథనం మేరకు.. సోమవారం మధ్యాహ్నం అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేసి ఇంటికి వెళ్లింది. మంగళవారం ఉదయం అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరవగా వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. గదిలోకి వెళ్లి చూడగా రెండు సిలిండర్‌లు, 6 కిలోల పప్పు, 65 కిలోల బియ్యం చోరీకి గురైనట్లు గుర్తించానని ఆయా తెలిపారు. చోరీ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై వీరబాబు తెలిపారు.

శ్రీశైలం వెళ్తూ.. ఒకరి అదృశ్యం

అమ్రాబాద్, న్యూస్‌టుడే : శ్రీశైలం బయలుదేరిన ఓ వ్యక్తి మార్గమధ్యలో అదృశ్యమయ్యాడు. అమ్రాబాద్ ఎస్సై ఖాద్రి, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం శేరిపల్లికి చెందిన మాడెం ఈదయ్య సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై ఒంటరిగా శ్రీశైలం బయలుదేరాడు. మంగళవారం క్షేత్ర పర్యటనకు వెళ్లిన మన్ననూరు ఎఫ్‌బీవో మధుసూదన్‌కు మన్ననూరు నుంచి 5 కి.మీ దూరంలో శ్రీశైలం ప్రధాన రహదారి పక్కన ద్విచక్ర వాహనం, శిరస్త్రాణం కనిపించాయి. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి చరవాణి, శిరస్త్రాణం, రెయిన్‌కోటు స్వాధీనం చేసుకొన్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం కోసం చరవాణిని పరిశీలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


ద్విచక్ర వాహనం

(c) eenadu